సాక్షి
ఆదిలాబాద్

శనివారం । 22 । ఏప్రిల్ । 2023



జీసీసీ పెట్రోల్ బంక్‌ల మూత

జీసీసీ ద్వారా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా ఆరు పెట్రోల్ బంక్‌లు ఏర్పాటు చేశారు. ఇందులో ఇప్పటికే నాలుగు మూతపడ్డాయి.

IIలో▸

ముగిసిన మూల్యాంకనం

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని సెయింట్ జోసెఫ్ కాన్వెంట్ పాఠశాలలో చేపట్టిన పదో తరగతి జవాబు పత్రాల మూల్యాంకనం శుక్రవారం ముగిసింది. ఈనెల 13న ప్రక్రియ ప్రారంభం కాగా, జిల్లాకు వచ్చిన లక్షా 64వేల జవాబు పత్రాలను ఉపాధ్యాయులు దిద్దారు. ఉపాధ్యాయులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని వసతులు కల్పించినట్లు డీఈవో ప్రణీత తెలిపారు.

గరిష్ఠం/కనిష్ఠం
39.0 /24.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. మధ్యాహ్నం ఉక్కపోతగా ఎక్కువవుతుంది. పలుచోట్ల ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది.

న్యూస్‌రీల్

యూడైస్‌లో సరైన సమాచారం నమోదు చేయాలి

ఆదిలాబాద్‌టౌన్: యూడైస్‌లో సరైన సమాచారం నమోదు చేయాలని విద్యాశాఖ సెక్టోరల్ అధికారి జే నారాయణ ఆదేశించారు. శుక్రవారం ఆదిలాబాద్ పట్టణంలోని తిర్పెల్లి హిందీ ఉన్నత పాఠశాలను సందర్శించారు. మరుగుదొడ్లను పరిశీలించారు. మౌలిక వసతులకు సంబంధించి యూడైస్‌లో సమాచారం నమోదు చేయాలని, మార్పులు.. చేర్పులుంటే త్వరగా చేపట్టాలని ప్రధానోధ్యాయుడికి సూచించారు. అవసరమైన మౌలిక వసతులు, విద్యార్థులు, ఉపాధ్యాయుల సంఖ్య కచ్చితంగా పొందుపర్చాలని ఆదేశించారు. ఆయన వెంట ఏఎస్వో సూరజ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలోనే అభివృద్ధిలో నంబర్ వన్‌గా ముఖరా కే

ఇచ్చోడ: తెలంగాణ రాష్ట్రంలో అభివృద్ధిలో నంబర్ వన్‌గా ముఖరా కే నిలుస్తుందని కేంద్ర పంచాయతీరాజ్ సహాయ మంత్రి కపిల్ పాటిల్ పేర్కొన్నారు. శుక్రవారం ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో జరిగిన నేషనల్ పంచాయతీ సెమినార్‌లో పాల్గొని మాట్లాడారు. దేశంలో 2.50లక్షల పంచాయతీలు పోటీపడగా 41 పంచాయతీలు ఎంపికైనట్లు తెలిపారు. ఇందులో ముఖరా కే ఉండడం అభినందనీయమన్నారు. వందశాతం ప్రభుత్వ పథకాలు అమలు చేయడంలో సర్పంచ్ మీనాక్షి ముందంజలో ఉన్నారని తెలిపారు.

డీసెట్ ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్‌టౌన్: డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ (డీసెట్) ప్రవేశ పరీక్షకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రభుత్వ డైట్ కళాశాల ప్రిన్సిపాల్ రవీందర్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 22నుంచి మే22 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఇతర వివరాలకు deecet. cdse. telanga na.gov.in వెబ్‌సైట్‌ను చూడాలని సూచించారు.

పబ్లిక్‌స్కూల్‌లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలి

ఆదిలాబాద్‌రూరల్: 2023–24 విద్యా సంవత్సరానికి హైదరాబాద్‌లోని రామంతపూర్ పబ్లిక్‌స్కూల్ (హెచ్‌పీఎస్)లో ఒకటో తరగతిలో లక్కీ డ్రా ద్వారా ప్రవేశం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి సునీతాకుమారి ఓ ప్రకటనలో తెలిపారు. 1.1.2017 నుంచి 31.12.2017 మధ్య జన్మించిన వారు అర్హులని పేర్కొన్నారు. అర్హత గల ఎస్సీ విద్యార్థులు ఈ నెల 17నుంచి మే 1 లోగా కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. నివాసం, పుట్టిన తేదీ, కుల, ఆదాయం సర్టిఫికెట్లు, రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు జిరాక్స్ ప్రతులు, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు జత చేయాలని సూచించారు. తల్లి, తండ్రి వార్షికాదాయం గ్రామీణ ప్రాంతాల వారికి రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల వారికి రూ.2లక్షలలోపు ఉండాలని పేర్కొన్నారు. ఇతర వివరాలకు 6281510601 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

బదిలీపై వెళ్తున్న జడ్జిలకు సన్మానం



జిల్లా జడ్జిని సన్మానిస్తున్న న్యాయవాదులు

ఆదిలాబాద్‌టౌన్: బదిలీపై వెళ్తున్న జడ్జిలను సంగెం ట్రస్ట్ ఆధ్వర్యంలో సన్మానించారు. జిల్లా కేంద్రంలోని కోర్టులో జిల్లా జడ్జి ఎంఆర్ సునీత, జిల్లా మొదటి అదనపు జడ్జి మాధవీ కృష్ణ, ఎస్సీ, ఎస్టీ కోర్టు జడ్జి సతీశ్‌కుమార్‌ను శాలువాతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా జడ్జిలు మాట్లాడారు. జిల్లాతో అనుబంధం, ఇక్కడి న్యాయవాదులు, కక్షిదారుల మనస్సు గొప్పదని పేర్కొన్నారు. జిల్లాలో పనిచేయడం సంతృప్తినిచ్చిందన్నారు. సంగెం ట్రస్ట్ చైర్మన్ సుధీర్‌కుమార్, న్యాయవాదులు నగేశ్, చంద్రకాంత్, శ్రీకాంత్, అఖిలేశ్, మోహన్, నారాయణ ఉన్నారు.

సీపీఆర్‌పై అవగాహన

నేరడిగొండ: మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో శుక్రవారం సీపీఆర్‌పై వైద్యసిబ్బందికి ప్రాజెక్ట్ అండ్ ట్రెనింగ్ ఆఫీసర్లు డాక్టర్ కిరణ్, మనోహర్ అవగాహన కల్పించారు. గుండెపోటు వచ్చి ప్రాణాలతో కొట్టుమిట్టాడే వారిని సీపీఆర్ చేసి కాపాడవచ్చని తెలిపారు. ఎక్కడైనా గుండెపోటుతో కుప్పకూలిన వ్యక్తిని గమనిస్తే వెంటనే సీపీఆర్ చేసి బతికించవచ్చని తెలిపారు. పీహెచ్‌సీ వైద్యులు ఎండీ సద్దాం, రాథోడ్‌రాజు, ఆరోగ్య విస్తరణాధికారి హరికుమార్‌గౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.



ఎలమంద వచ్చే వేళాయే..

జిల్లాలోని గొర్రెల కాపరుల సహకార సంఘాలు: 133
సంఘాల్లోని సభ్యుల సంఖ్య: 8,660
మొదటివిడత లబ్ధిదారుల సంఖ్య: 5,022
మలివిడతలో పంపిణీ యూనిట్లు: 3,597
డీడీలు చెల్లించిన సభ్యుల సంఖ్య: 2,103

- రెండో విడత పంపిణీకి సన్నద్ధం
- రవాణాకు టెండర్ ప్రక్రియ పూర్తి
- మహారాష్ట్ర, కర్నాటక, ఏపీ నుంచి.. కొనుగోలుకు సర్కార్ ఏర్పాట్లు
- అక్రమాలకు తావివ్వకుండా చర్యలు
- మే మొదటివారంలో పంపిణీ..!

కైలాస్‌నగర్: మలివిడత గొర్రెల కోసం నాలుగేళ్లుగా ఎదురుచూస్తున్న లబ్ధిదారుల నిరీక్షణకు ఎట్టకేలకు తెరపడే అవకాశం కనిపిస్తోంది. ఈ నెలాఖరులోగా సబ్సిడీ గొర్రెలు అందించాలనే ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారులు కసరత్తు ముమ్మరం చేశారు. గతంలో జరిగిన అక్రమాలు పునరావృతం కాకుండా పారదర్శకంగా కొనుగోలు, పంపిణీ జరిగేలా చర్యలు చేపడుతున్నారు. ప్రతీ మండలానికి జిల్లాస్థాయి అధికారులను ప్రత్యేకాధికారులుగా నియమించారు. ఒక్కో మండలానికి ముగ్గురు చొప్పున పంచాయతీరాజ్, వ్యవసాయ, ఐకేపీ అధికారులతో కూడిన కమిటీలు ఏర్పాటు చేశారు. పశుసంవర్ధకశాఖ రాష్ట్రస్థాయి అధికారి పర్యవేక్షణలో కమిటీల్లో ఉన్న అధికారులు గొర్రెలు కొనుగోలు చేసి జిల్లాకు తీసుకురానున్నారు.

రవాణా టెండర్ ప్రక్రియ పూర్తి

రెండోవిడత గొర్రెల సరఫరాకు సంబంధించిన రవాణా టెండర్ల ప్రక్రియను పశుసంవర్ధకశాఖ పూర్తి చేసింది. ఇందుకు ఆన్‌లైన్‌లో రాష్ట్రస్థాయిలో టెండర్లు ఆహ్వానించారు. జిల్లా రవాణా బాధ్యతల కోసం ఆరు ట్రాన్స్‌పోర్టు కంపెనీలు పోటీపడ్డాయి. ఇందులో జగిత్యాలకు చెందిన ట్రాన్స్‌పోర్టు కంపెనీ గొర్రెల సరఫరా టెండర్ దక్కించుకుంది. ఒక్కో గొర్రెకు కిలో మీటర్‌కు రూ.48పైసల చొప్పున చెల్లించేలా ఒప్పందం ఖరారైంది. గతంలో జరిగిన అక్రమాలకు తావివ్వకుండా జీపీఎస్ సౌకర్యమున్న వాహనాల్లోనే గొర్రెలు రవాణా చేయనున్నారు. వాటిని తరలించే వాహన జీపీఎస్ పశుసంవర్ధకశాఖ కమిషనర్ కార్యాలయంతో అనుసంధానమై ఉంటుంది. వాటిని లబ్ధిదారులకు అందించాక ప్రత్యేకాధికారులు వారి ఇళ్లకు వెళ్లి క్షుణ్ణంగా పరిశీలించనున్నారు. తద్వారా అక్రమాలకు చెక్‌పడే అవకాశముంటుంది.

మృతుల నామినీలకూ అవకాశం

మలివిడత గొర్రెల కోసం డీడీలు చెల్లించిన జిల్లాకు చెందిన గొర్రెల కాపరుల్లో 110మంది మరణించారు. వారి స్థానంలో వారి నామినీల (భార్య/కుమారులు)కు గొర్రెలు అందించే అవకాశం ప్రభుత్వం కల్పించింది. దీంతో ఇప్పటికే వివరాలు సేకరించిన అధికారులు వారితో డీడీలు కట్టించుకుంటున్నారు.

మే మొదటివారంలో పంపిణీ!



జిల్లాలో మలివిడత గొర్రెల పంపిణీకి అవసరమైన కసరత్తు పూర్తి చేశాం. వాటి రవాణాకు టెండర్ల ప్రక్రియ పూర్తయింది. అక్రమాలకు తావివ్వకుండా పారదర్శకంగా కొనుగోలు, పంపిణీ జరిగేలా మండలానికో జిల్లా అధికారిని ప్రత్యేకాధికారిగా నియమించాం. కొనుగోలు కోసం ఇతర శాఖల అధికారులనూ ఎంపిక చేశాం. ప్రభుత్వం ఎప్పుడు కొనుగోలు చేయాలని ఆదేశిస్తే అప్పుడే ఆయా జిల్లాలకు వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నాం. మే మొదటి వారంలో లబ్ధిదారులకు గొర్రెలు అందే అవకాశముంది.

– కిషన్, జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి

మూడు రాష్ట్రాల నుంచి కొనుగోలు

జిల్లాకు అవసరమైన యూనిట్లకు సంబంధించిన గొర్రెల కొనుగోలుకు మహారాష్ట్రలోని అకోల, కర్నాటకలోని బీదర్, ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు, కృష్ణా జిల్లాలను ఎంపిక చేశారు. ఆయా ప్రాంతాల్లోనే గొర్రెలు కొనుగోలు చేయాల్సి ఉంటుంది. వాటి కొనుగోలు కోసం గతంలో మండల పశు వైద్యాధికారులను పంపించారు. దీంతో వారు కొనుగోలు చేయకుండానే చేసినట్లుగా రికార్డులు సృష్టించి రూ.కోట్లు దండుకున్నారు. యూనిట్లను అందించకున్నా అందించినట్లుగా చూపి ప్రభుత్వ సొమ్ము పక్కదారి పట్టించారు. ఒక యూనిట్‌నే పది మందికి పంపిణీ చేసినట్లుగా చూపించారు. కానీ.. ఈసారి అలాంటి అక్రమాలకు తావివ్వకుండా పశుసంవర్ధకశాఖ పకడ్బందీ చర్యలు చేపట్టింది. ఆ శాఖ రాష్ట్ర ఉన్నతాధికారి పర్యవేక్షణలోనే మండల కమిటీ అధికారులు గొర్రెలు కొనుగోలు చేసి జిల్లాకు తీసుకురానున్నారు. కొనుగోలు చేసిన ప్రతీ గొర్రెతో పాటు లబ్ధిదారుల ఫొటోలు జీవసమృద్ధి వెబ్ (ఈల్యాబ్)లో అప్‌లోడ్ చేయనున్నారు. వాటిని స్థానిక ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో లబ్ధిదారులకు అందజేయనున్నారు. దీంతో అక్రమాలు జరగకుండా అర్హులందరికీ గొర్రెలు అందే అవకాశముంటుంది.

సాదాసీదాగా ప్రజావేదిక



సామాజిక తనిఖీలో మాట్లాడుతున్న కిషన్

ఉట్నూర్ రూరల్: మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన ఉపాధిహామీ పథకం ప్రజావేదిక సాదాసీదాగా జరిగింది. జనం లేకపోవడంతో తనిఖీ బృందాలు, అధికారులు, ప్రజాప్రతినిధులు సామాజిక తనిఖీ నిర్వహించారు. ట్రైనీ కలెక్టర్ శ్రీజ, ఇతర అధికారులు కిషన్, రవీందర్, వీణ, తిరుమల, రజినీకాంత్ హాజరయ్యారు. 2019 డిసెంబర్ నుంచి 2023 మార్చి వరకు చేపట్టిన రూ.27 కోట్ల పనుల వివరాలు పది రోజులుగా తనిఖీ బృందాలు గ్రామపంచాయతీల వారీగా సేకరించారు. 2019 నుంచి మండలంలోని 37 గ్రామపంచాయతీల్లో హరితహారం, పల్లె ప్రగతి, ప్రకృతివనం పథకాల అమలులో భాగంగా నాటిన వేలాది మొక్కలు ఎండిపోయినట్లు సామాజిక తనిఖీ బృందాలు తేల్చాయి. ఆయా గ్రామపంచాయతీల్లో రికార్డుల ఆధారంగా నాటిన మొక్కలు పరిశీలిస్తే అవి ఎక్కడికక్కడ ఎండిపోయినట్లు గుర్తించామని బృందాల సభ్యులు పేర్కొన్నారు. డంపుయార్డ్‌లు, శ్మశాన వాటికల నిర్మాణాలు చేపట్టినా నిర్వహణ లేక నిరుపయోగమవుతున్నాయని తెలిపారు. కొన్ని గ్రామాల్లో మస్టర్లు లేకుండా పనులు చేసినట్లు తమ దృష్టికి వచ్చిందని పేర్కొన్నారు. జాబ్ కార్డులో పేర్లున్న వారు కాకుండా ఒకరికి బదులు మరొకరు చాలాచోట్ల ఉపాధి పనులకు వెళ్తారన్నారు. పలుచోట్ల నాలుగు నుంచి ఏడు వారాల వరకు ఇప్పటి వరకు కూలి డబ్బులు రాలేదని పేర్కొన్నారు. అనంతరం డీఆర్‌డీవో కిషన్ మాట్లాడుతూ.. మండలంలో 12వ విడత సామాజిక తనిఖీ నిర్వహించినట్లు తెలిపారు. 2019 నుంచి 2023 మార్చి వరకు మండలంలో రూ.27 కోట్ల విలువైన పనులను ఉపాధిహామీ ద్వారా చేపట్టినట్లు తెలిపారు. గ్రామపంచాయతీల వారీగా తనిఖీ అనంతరం నివేదికలు ఉన్నతాధికారులకు అందజేస్తామని తెలిపారు. తనిఖీల్లో బయటపడ్డ అక్రమాలపై శాఖాపరమైన విచారణ అనంతరం బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం సామాజిక తనిఖీని కొనసాగించారు. ఎంపీపీ జైవంత్‌రావ్, సర్పంచులు, ఎంపీటీసీలున్నారు.

వడగాలులపై ముగిసిన శిక్షణ



ధ్రువీకరణ పత్రాలు అందుకుంటున్న అధికారులు

బోథ్: రానున్న రోజుల్లో ఎండల తీవ్రత ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున వడగాలులు, వాటి తీవ్రత, ముందు జాగ్రత్తలు, విపత్తు నివారణకు చేపట్టాల్సిన చర్యల గురించి హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో రాష్ట్రంలోని 35 మందికి శిక్షణ ఇచ్చారు. నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో ఐదురోజుల పాటు శిక్షణ కొనసాగింది. ఆదిలాబాద్ జిల్లా నుంచి ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారులు బోనగిరి కార్తీక్ (వాగ్దేవి డిగ్రీ కళాశాల, బోథ్), భూమన్న (విద్యార్థి డిగ్రీ కళాశాల, ఆదిలాబాద్), ఆశ్రఫ్ (ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఆదిలాబాద్)ను ఎంపిక చేయగా శిక్షణ శుక్రవారం ముగిసింది. మానవ వనరుల అభివృద్ధి కేంద్రం డైరెక్టర్ జనరల్ బెనహర్‌దత్ ఎక్క, ఎన్‌ఐడీఎమ్ జాయింట్ డైరెక్టర్ పీఎస్ రెడ్డి మాట్లాడుతూ.. శిక్షణ పొందిన వారు గ్రామాల్లోకి వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో మానవ వనరుల అభివృద్ధి కేంద్రం కో ఆర్డినేటర్ వినోద్, శిక్షకులు డాక్టర్ బాలు, డాక్టర్ రంజన్‌కుమార్ పాల్గొన్నారు.

సమ్మెకు దిగడం చట్టరీత్యా నేరం

ఎదులాపురం: ఎస్మా 1971 యాక్ట్ ప్రకారం ఎన్పీడీసీఎల్ 17 జిల్లాల పరిధిలో అత్యవసర సేవల విభాగం కిందకు వస్తుందని, ఈ నేపథ్యంలో ఏ ఉద్యోగి సమ్మెకు దిగినా చట్టరీత్యా నేరమని ఎన్పీడీసీఎల్ చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ బీ జనార్దన్ ఓ ప్రకటనలో తెలిపారు. విద్యుత్ సంస్థల్లో సమ్మెలు నిషేధించినట్లు పేర్కొన్నారు. యాజమాన్యం సానుకూలంగా ఉన్నప్పటికీ కొందరు సమ్మెకు వెళ్తుండడంతో వరంగల్, జనగాం, ఖమ్మం, కరీంనగర్ జిల్లాల పరిధిలో కొందరు ఆర్టిజన్ ఉద్యోగులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. ఈ విషయాన్ని ఉద్యోగులు గమనించాలని సూచించారు.

ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలి

- జిల్లా జడ్జి ఎంఆర్ సునీత
- దివ్యాంగులకు ట్రైసైకిళ్ల పంపిణీ



ట్రైసైకిళ్లు పంపిణీ చేస్తున్న జిల్లా జడ్జి సునీత

ఆదిలాబాద్‌టౌన్: దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని జిల్లా జడ్జి ఎంఆర్ సునీత సూచించారు. జిల్లా కేంద్రంలోని డీఎల్ఎస్ఏ కార్యాలయంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో దివ్యాంగులకు శుక్రవారం ట్రైసైకిళ్లు, ఇతర పరికరాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ.. వైకల్యం శరీరానికే గాని మేధస్సుకు కాదని పేర్కొన్నారు. వైకల్యం ఉన్నవారిని అన్ని రంగాల్లో రాణించేలా ప్రోత్సహించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా మొదటి అదనపు న్యాయమూర్తి మాధవీకృష్ణ, సీనియర్ సివిల్ జడ్జి ప్రమిళజైన్, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి క్షమాదేశ్ పాండే, జడ్జి సతీశ్‌కుమార్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నగేశ్, పీపీ సంజయ్ వైరాగ్రే, డిఫెన్స్ కౌన్సిల్స్ దాసరి గంగారాం, అరుగుల అశోక్, ఉమేశ్ తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా హోంగార్డుల బదిలీల ప్రక్రియ

- ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి



ప్రక్రియ పరిశీలిస్తున్న ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

ఆదిలాబాద్‌టౌన్: హోంగార్డుల బదిలీల ప్రక్రియను పారదర్శకంగా చేపట్టినట్లు ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని పోలీస్ హెడ్‌క్వార్టర్‌లో హోంగార్డుల బదిలీల ప్రక్రియ చేపట్టారు. లక్కీ లాటరీ ద్వారా 115 మంది హోంగార్డుల్లో 15 మందిని జిల్లాకే కేటాయించగా, 100 మందికి స్థానచలనం కల్పించారు. నిర్మల్ జిల్లాకు 62 మంది, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాకు 38 మంది బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ఎలాంటి అపోహలు లేకుండా ప్రక్రియ చేపట్టినట్లు తెలిపారు. సాధారణ విధులు నిర్వహించే హోంగార్డులు, వాహన డ్రైవర్లు, ధోబీలు, వంట పనివారు, వివిధ రంగాల్లో విధులు నిర్వహిస్తున్న వారిని బదిలీ చేసినట్లు పేర్కొన్నారు. అదనపు ఎస్పీలు శ్రీనివాస్‌రావు, రాములునాయక్, రిజర్వ్ సీఐలు వెంకటి, వంశీకృష్ణ, వేణు, కిరణ్‌కుమార్, రామకృష్ణ, పోలీస్ కార్యాలయ సిబ్బంది శంకరమ్మ, సంజీవ్, గంగాధర్, రిజ్వానా బేగం, దయానంద్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ‘సీపీఐ ఇంటింటికీ..’

ఎదులాపురం: ‘బీజేపీ కో హటావో.. దేశ్ కో బచావో’ నినాదంతో చేపట్టిన ‘సీపీఐ ఇంటింటికీ’ కార్యక్రమం కొనసాగుతోంది. శుక్రవారం పట్టణంలోని భుక్తాపూర్ కాలనీలో కార్యక్రమాన్ని నిర్వహించారు. పార్టీ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యురాలు ముడుపు నళినీరెడ్డి హాజరై కేంద్రం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాల గురించి ప్రజలకు వివరించారు. తీరు మార్చుకోకుంటే ప్రజల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. రెడ్డి జిల్లా సహాయ కార్యదర్శి సిర్ర దేవేందర్, కార్యవర్గ సభ్యుడు కుంటాల రాములు, పట్టణ కార్యదర్శి అరుణ్‌కుమార్, నాయకులు గణేశ్, పొచ్చిరం, సంగీత, కృష్ణవేణి, షబానా, అమీన్‌ఖాన్, మెహబూబ్‌ఖాన్, ప్రజాసంఘాల నాయకులున్నారు.

రోడ్డు నిర్మాణానికి కేంద్రం గ్రీన్ సిగ్నల్

- రూ.40.24 కోట్ల నిధులు మంజూరు
- ఎంపీ సోయం బాపూరావు వెల్లడి



సోయం బాపూరావు

ఆదిలాబాద్: జైనథ్ మండలంలోని నిరాల గ్రామం నుంచి జిల్లా కేంద్రంలోని సీసీఐ వరకు రహదారి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూ.40.24 కోట్లు మంజూరు చేసిందని ఎంపీ సోయం బాపూరావు ఓ ప్రకటనలో తెలిపారు. సీఆర్ఐఎఫ్ నిధులతో జైనథ్ మండలంలోని నిరాల నుంచి అడ, లాండసాంగ్వి మీదుగా సీసీఐ వరకు 15 కిలోమీటర్ల పొడవున రహదారి విస్తరణతో పాటు రోడ్డు నిర్మాణ పనులు త్వరలో ప్రారంభించి వానాకాలానికి ముందే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. జైనథ్, బేల మండలాలకు వెళ్లే ప్రధాన రహదారిలోగల తరోడా బ్రిడ్జి ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని కేంద్రం నిధులు మంజూరు చేసిందని పేర్కొన్నారు. తరోడా వద్ద 2018లో వర్షాల కారణంగా వంతెన దెబ్బతిని ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోలేదని ఆరోపించారు. ఈ సమస్యను జాతీయ రహదారుల సంస్థ అధికారులకు నివేదించగా కేంద్ర రహదారుల మంత్రిత్వశాఖ నుంచి అత్యవసరంగా ప్రత్యామ్నాయ నిధులు మంజూరైనట్లు వెల్లడించారు. తరోడా వంతెన టెండర్ ప్రక్రియ కొంత జాప్యం జరిగే అవకాశం ఉన్నందున ప్రత్యామ్నాయంగా నిరాల నుంచి ఆదిలాబాద్ వరకు రహదారి విస్తరణతో పాటు రోడ్డు నిర్మాణ పనులు చేపడతామని ఎంపీ తెలిపారు. ఈ ప్రాంత ప్రజలు అధికారులకు సహకరించాలని కోరారు. కేంద్రమంత్రికి, కేంద్ర రహదారుల మంత్రిత్వ శాఖ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే బేల మండలం సదల్పూర్ గ్రామ సమీపంలోని పురాతన ఖైరందేవ్ మహాదేవుని ఆలయాల పునరుద్ధరణకు కేంద్ర పురావస్తు శాఖ ప్రత్యేక దృష్టి సారించిందని పేర్కొన్నారు. శిథిలావస్థలో ఉన్న ఆలయాన్ని పునరుద్ధరించి వెలుగులోకి తీసుకువస్తామని స్పష్టం చేశారు. గోండు రాజుల కాలంనాటి ఖైరందేవ్ ఆలయ అభివృద్ధి గురించి ఇటీవల కేంద్ర గిరిజన శాఖ మంత్రి అర్జున్ ముండాను కలిసి విన్నవించగా ఇటీవల కేంద్ర అధికారుల బృందం సందర్శించినట్లు తెలిపారు. త్వరలో నివేదిక సమర్పించి ఆదివాసీ ఆలయాలను పునరుద్ధరింపజేస్తామని ఎంపీ బాపూరావు వివరించారు.

నేడే రంజాన్



ప్రార్థనలకు సిద్ధమైన ఈద్గా మైదానం

ఆదిలాబాద్: ముస్లింల ప్రధాన పండుగ రంజాన్‌ను శనివారం ఘనంగా నిర్వహించుకునేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించుకోవడానికి పట్టణంలోని ఈద్గా మైదానం సిద్ధమైంది. ప్రార్థనల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయనున్నారు.

నూతన ఆవిష్కరణలతో ముందుకు రావాలి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న రవి

తాంసి: గ్రామీణ యువత స్థానిక సమస్యల పరిష్కారానికి నూతన ఆవిష్కరణలు చేపట్టేందుకు ముందుకు రావాలని కలెక్టరేట్ ఈడీఎం బండి రవి సూచించారు. తెలంగాణ స్టేట్ ఇన్నోవేషన్ సెల్ (టీఎస్ఐసీ), రాష్ట్ర సమాచార సాంకేతిక (ఐటీ) ఎలక్ట్రానిక్స్‌లో భాగంగా రాష్ట్రమంతటా నూతన ఆవిష్కరణలు పెంచడంలో భాగంగా గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం పొన్నారి గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద టీఎస్ఐసీ, పంచాయతీరాజ్ రూరల్ డెవలప్‌మెంట్‌శాఖ సహకారంతో టీ ఇన్నోవేషన్ మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. కలెక్టరేట్ ఈడీఎం బండి రవి, డీపీవో శ్రీనివాస్ హాజరై ప్రజలకు అవగాహన కల్పించారు. స్థానిక సమస్యలు స్థానికంగానే పరిష్కరించేలా ఆవిష్కరణలపై అధికారులు గ్రామస్తులకు వివరించారు. ఈ సందర్భంగా ఈడీఎం రవి మాట్లాడుతూ.. గ్రామస్థాయిలో ఆవిష్కరణలకు ఊతమిచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ప్రతిఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని నూతన ఆవిష్కరణలపై దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. సీఎస్‌సీ జిల్లా మేనేజర్ కామేరి రాహుల్, సర్పంచ్ సంజీవ్‌రెడ్డి, ఎంపీవో సుధీర్‌రెడ్డి, ఉపసర్పంచ్ అశోక్, పంచాయతీ కార్యదర్శి విజయ్ ఉన్నారు.

ఉగ్రవాదుల అణిచివేతకు చర్యలు

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్



అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

ఆదిలాబాద్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తొమ్మిదేళ్లలో ఉగ్రవాదుల అణచివేతకు అన్ని చర్యలు తీసుకుంటోందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్ పేర్కొన్నారు. గురువారం జమ్ము కాశ్మీర్లో జరిగిన ఉగ్ర దాడిలో మరణించిన సైనికులకు జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయ సమీపంలోని అమరవీరుల స్తూపం ఎదుట నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొన్ని రాజకీయ పార్టీల నాయకులు, మత శక్తులు ఒక వర్గం వారిని తృప్తిపరిచేందుకు ఉగ్రవాదులను సమర్థిస్తున్నాయని ఆరోపించారు. పరోక్షంగా భారత సైనికుల ప్రాణాలను బలి ఇస్తున్నారని మండిపడ్డారు. భారత దేశంలో ఉగ్రవాదుల నిర్మూలనకు కేంద్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో కృషి చేస్తుంటే ఓటు బ్యాంక్ రాజకీయాలు చేసే కొన్ని పార్టీలు అడుగడుగునా ఆటంకాలు సృష్టిస్తున్నాయని విమర్శించారు. కొన్ని పార్టీలు పీఎఫ్ఐ లాంటి సంస్థలకు ప్రత్యక్షంగా మద్దతు ఇస్తున్నాయని మండిపడ్డారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వానికంటే ముందు దేశం నలమూలలా ఉగ్రదాడులు జరిగేవని పేర్కొన్నారు. ప్రస్తుతం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సుస్థిర పాలన చూసి ఓర్వలేకే కొన్ని పార్టీలు చిల్లర రాజకీయాలు చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలో జీ20 సమావేశాలు జరగనున్న నేపథ్యంలో ఉనికి చాటుకునేందుకు ఉగ్రవాదులు ప్రయత్నిస్తున్నారని, అయితే కేంద్ర ప్రభుత్వం వాటిని సమర్థవంతంగా తిప్పికొడుతుందన్నారు. నాయకులు జోగు రవి, ఆదినాథ్, వేణుగోపాల్, ఆకుల ప్రవీణ్, జ్యోతిరెడ్డి, మయూర్ చంద్ర, స్వామిరెడ్డి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు. అలాగే సనాతన హిందూ ఉత్సవ సమితి, ఎక్స్ ఆర్మీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అమర వీరుల స్మారక స్తూపం వద్ద నివాళులర్పించారు. ఉత్సవ సమితి సభ్యులు ఈర్ల సత్యనారాయణ, నర్సాగౌడ్, సమితి అధ్యక్షుడు ప్రమోద్‌కుమార్ ఖత్రి, మాజీ సైనికుల అధ్యక్షులు శంకరదాస్, అశోక్, పడకండి సూర్యకాంత్, లోలపు శ్రీనివాస్, వామన్‌రెడ్డి, అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జీసీసీ పెట్రోల్ బంక్‌లు మూత

- అధికారుల తప్పిదాలతో సంస్థకు నష్టం
- జిల్లాలో ఆరు బంక్‌ల్లో నాలుగు మూసివేత
- మరింత నష్టాల్లోకి జీసీసీ



ఇచ్చోడలో మూత పడ్డ జీసీసీ పెట్రోల్ బంక్

ఇచ్చోడ: గిరిజన కో ఆపరేటివ్ సంస్థ (జీసీసీ) ద్వారా ఏర్పాటు చేసిన పెట్రోల్ బంక్‌లు అనతి కాలంలోనే మూత పడ్డాయి. జీసీసీ సహకార సంస్థను మరింత లాభాల బాటలో నడిపించాలనే ఉద్దేశంతో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఆ సంస్థ ఆరు పెట్రోల్ బంక్‌లను ఏర్పాటు చేసింది. పెట్రోల్ బంక్‌ల ద్వారా గిరిజన సహకార సంస్థను మరింత లాభాల వైపు నడిపించడంతో పాటుగా గిరిజన యువతకు ఉపాధి కల్పన కోసం ఏర్పాటు చేశారు. బంక్‌ల ఏర్పాటు కోసం ప్రధాన కూడళ్ల వద్ద విలువైన స్థలాలను ఐటీడీఏ ద్వారా కేటాయించి బంక్‌ల నిర్మాణం చేపట్టారు. కానీ నిర్మాణం చేపట్టిన తక్కువ కాలంలోనే బంక్‌లు మూత పడ్డాయి. దీంతో జీసీసీ సంస్థ లాభాల బాటలోకి వెళ్లడం ఏమో కానీ నష్టాల్లో కూరుకుపోయే ప్రమాదముందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

జిల్లాలో ఆరు బంక్‌లు...

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో మొత్తం ఆరు బంక్‌లు నిర్వహిస్తున్నారు. అందులో ఇచ్చోడ, సిరికొండ, కెరమెరి, జైనూర్, నిర్మల్, ఉట్నూర్‌లో జీసీసీ పెట్రోల్ బంక్‌లను ఏర్పాటు చేసింది. కానీ నాలుగు నెలల నుంచి ఇచ్చోడ, సిరికొండ, కెరమెరి, జైనూర్ పెట్రోల్ బంక్‌లు మూతపడ్డాయి.

అధికారుల తప్పిదంతో...

అధికారుల తప్పిదంతోనే పెట్రోల్ బంక్‌లు మూతపడినట్లు తెలుస్తోంది. పెట్రోల్ బంక్‌ల నిర్వహణ సరిగ్గా లేక, బంక్‌లు పర్యవేక్షిస్తున్న జీసీసీ ఉద్యోగులు ఇష్టారాజ్యంగా వ్యవహరించడం, నో స్టాక్ బోర్డులు తగిలించడం, వినియోగదారులకు సరైన సేవలు అందించకపోవడం లాంటి కారణాలతో పాటు ముందస్తుగా ఐటీ రిటన్స్ చూపకపోవడంతో ప్రధాన కారణంగా తెలుస్తోంది. జీసీసీ ఉన్నతాధికారులకు ముందు చూపు లేకపోవడంతోనే పెట్రోల్ బంక్‌లపై ఐటీ రూపంలో భారీగా ఐటీ శాఖ కట్ చేసుకున్నట్లు తెలుస్తోంది. జీసీసీ శాఖలో పనిచేస్తున్న ఉన్నతాధికారులకు ఐటీ రూల్స్ తెలియకపోవడంపై పలువురు విస్మయం చెందుతున్నారు. మూతపడిన నాలుగు పెట్రల్ బంక్‌ల్లో దాదాపుగా రూ.కోటి వరకు ఐటీ కట్ అయినట్లు సమాచారం. ఈ డబ్బులు తిరిగి తెప్పించడానికి అధికారులు ప్రయత్నిస్తున్నారని, అప్పటి వరకు బంక్‌లను మూసివేశామని, డబ్బు రాగానే బంక్‌లను తెరిపిస్తామని అధికారులు చెబుతున్నప్పటికీ పలు అనుమానాలకు తావిస్తోంది.

మరింత నష్టాల్లోకి...

నాలుగు నెలల నుంచి బంక్‌లు మూతపడడంతో మరింతగా నష్టాల్లోకి జీసీసీ వెళ్లే ప్రమాదం ఉందని తెలుస్తోంది. మూతపడిన నాలుగు బంక్‌లకు విద్యుత్ బిల్లులు, బంక్‌లలో పనిచేసే 60మంది కార్మికులకు నాలుగు నెలల నుంచి వేతనాలు, బంక్‌ల నిర్వహణకు ఇతర ఖర్చుల భారం పడి మరింత నష్టాల్లోకి వెళ్లే ప్రమాదం ఉందని తెలుస్తోంది.

నిర్వహణకు డబ్బులు లేకనే..

జీసీసీ బంక్‌ల నిర్వహణకు సంస్థ వద్ద డబ్బులు లేకపోవడంతోనే జిల్లాలో కొన్ని బంక్‌లు మూతపడ్డాయి. ఐటీ కట్ కావడం కూడా బంక్‌ల బంద్‌కు కారణమైంది. సంస్థకు డబ్బులు రాగనే బంక్‌లను పునః ప్రారంభిస్తాం.

– రామానందం, జిల్లా మేనేజర్

యువకుడిపై వీధి కుక్కల దాడి

ఆదిలాబాద్‌రూరల్: వీధి కుక్కల దాడులు రోజురోజుకూ పెరిగిపోవడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. గురువారం ఆదిలాబాద్ రూరల్ మండలంలోని అంకోలి గ్రామంలో ఇద్దరిపై వీధి కుక్కలు దాడి చేసిన విషయం తెలిసిందే. శుక్రవారం అదే గ్రామానికి చెందిన అభిషేక్ అనే మరో యువకుడిపై కుక్కలు దాడి చేశాయి. గాయపడ్డ అతడిని కుటుంబ సభ్యులు చికిత్స కోసం జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. గ్రామంలో కుక్కలు వరుసగా దాడులు చేస్తుండడంతో గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. తమ గ్రామంలో సంచరిస్తున్న వీధి కుక్కలను ఇతర చోటికి తరలించాలని ప్రజలు కోరుతున్నారు.

విక్రాంత్ సీడ్స్‌పై కేసు నమోదు చేయాలి



ఫిర్యాదు చేస్తున్న రైతులు

జైనథ్: విక్రాంత్ సోయా సీడ్స్ కంపెనీపై చీటింగ్ కేసు నమోదు చేయాలని పలువురు రైతులు డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రానికి చెందిన రైతులు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి విక్రాంత్ కంపెనీపై ఫిర్యాదు చేశారు. నాసిరకం సోయా విత్తనాలతో మండలంలో వందలాది మంది రైతులు మోసపోయారని తెలిపారు. నష్టపోయిన రైతులందరికీ పరిహారం అందిస్తామని విక్రాంత్ సీడ్స్ ప్రతినిధులు వ్యవసాయశాఖ అధికారులకు లేఖ రాసి ఇచ్చినట్లు తెలిపారు. వ్యవసాయశాఖ అధికారులు సిద్ధం చేసిన జాబితాలో తమ పేర్లున్నప్పటికీ ఇప్పటివరకు తమకు పరిహారం ఇవ్వలేదని వాపోయారు. దాదాపు ఏడాదిగా ప్రతినిధులు రేపు, మాపు అంటూ దాటవేస్తున్నారని, కంపెనీ కేసు నమోదు చేయాలని కోరారు.

ఈద్గాకు మున్సిపల్ నిధుల కేటాయింపుపై నిరసన



వినతి పత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: పట్టణాభివద్ధి కోసం ఖర్చు చేయాల్సిన మున్సిపల్ నిధులను సారంగాపూర్ మండలం చించోలి(బి) వద్ద నిర్మించిన ఈద్గాకు కేటాయించడంపై బీజేపీ నాయకులు శుక్రవారం ఆందోళన చేశారు. నిర్మల్ మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడికి యత్నించారు. పోలీసులు బీజేపీ నాయకులు మున్సిపల్ కార్యాలయంలోకి వెళ్లకుండా అడ్డుకున్నారు. ఈ క్రమంలో పోలీసులు, బీజేపీ నాయకుల మధ్య సుమారు గంటపాటు వాగ్వాదం జరిగింది. అనంతరం మున్సిపల్ ఆర్‌ఐకి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ..వత్తి విద్య నైపుణ్య శిక్షణ కేంద్రం కోసం కేటాయించిన 12 ఎకరాల అటవీ భూమిలో నిబంధనలకు విరుద్ధంగా ఈద్గా నిర్మించడంతోపాటు, నిర్మాణానికి రూ.1.30 కోట్లు మున్సిపాలిటీ నుంచి కేటాయించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణ ప్రజలు చెల్లించే పన్నులను పట్టణ ప్రజల అవసరాలు, సౌకర్యాల కోసం ఖర్చు చేయాల్సి ఉండగా నిబంధనలు ఉల్లంఘించి మున్సిపల్ పరిధిలో లేని ఈద్గాకు కేటాయించారని ఆరోపించారు. మతపరమైన కార్యక్రమాలకు ప్రజాధనం ఖర్చు చేయడం ఏమిటని ప్రశ్నించారు. ఇంత జరుగుతున్నా మున్సిపల్ కౌన్సిలర్లు మౌనం వహించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరసనలో పార్లమెంట్ కన్వీనర్ అయ్యన్నగారి భూమయ్య, పెద్దపల్లి జిల్లా ఇన్‌చార్జి రావుల రాంనాథ్, జిల్లా ప్రధాన కార్యదర్శులు మెడిసెమ్మె రాజు, సామ రాజేశ్వర్‌రెడ్డి, డాక్టర్ మల్లికార్జున్‌రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ నాయుడు మురళి, జిల్లా ఉపాధ్యక్షుడు కమల్ నయన్, జిల్లా కార్యదర్శి మిట్టపల్లి రాజేందర్, శ్రావణ్‌రెడ్డి, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి అమరవీని నర్సాగౌడ్, దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడు రాచకొండ సాగర్, యువ మోర్చా జిల్లా అధ్యక్షుడు ఒడిసెల అర్జున్, బీసీ మోర్చా రాష్ట్ర నాయకులు పొన్నం నారాయణగౌడ్, మండల అధ్యక్షులు తోకల అనిల్, ఠాగూర్, అర్జున్, మేకల ప్రేమ్ కుమార్, కోరిపల్లి లింగారెడ్డి, పట్టణ ప్రధాన కార్యదర్శి అల్లం భాస్కర్, యువమోర్చా నాయకులు కొండాజి శ్రావణ్, ఆకుల కార్తీక్ గిల్లీ, విజయ్, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.





పేదింటి చిన్నోడికి.. పెద్ద కష్టం

- చిన్నారికి రక్తప్రసరణ వ్యవస్థలో ఇబ్బంది
- లక్షల్లో వైద్య ఖర్చులు
- దాతలు ఆదుకోవాలని తల్లిదండ్రుల వేడుకోలు



తల్లితో చిన్నారి రాహుల్

నిర్మల్‌రూరల్: ఆడుతూ పాడుతూ తిరిగే చిన్నారి అనారోగ్యానికి గురి కావడంతో నిరుపేద కుటుంబానికి చెందిన తల్లిదండ్రులు తల్లడిల్లుతున్నారు. మండలంలోని తల్వేద గ్రామానికి చెందిన వైశాలి, రవి దంపతుల కుమారుడు రాహుల్ (9 నెలలు) రక్తప్రసరణ వ్యవస్థలో ఇబ్బంది తలెత్తింది. వైద్యానికి రూ.లక్షలు కావడంతో ఆ పేద కుటుంబం ఒక్కగానొక్క బిడ్డను కాపాడుకునేందుకు అల్లాడుతోంది. వైశాలి, రవి దంపతులకు మూడేళ్ల క్రితం వివాహమైంది. రెండేళ్ల తర్వాత రాహుల్ జన్మించాడు. ఏడు నెలల వయసులో జ్వరం రావడంతో జిల్లా కేంద్రంతో పాటు నిజామాబాద్‌లో వైద్యులకు చూపించారు. ఎంతకీ నయం కాకపోవడంతో హైదరాబాదులోని ఓ ప్రైవేటు పిల్లల ఆసుపత్రిని సంప్రదించారు. అయితే అక్కడి వైద్యులు పరీక్షలు నిర్వహించిన అనంతరం రాహుల్‌కు రక్తప్రసరణ వ్యవస్థలో లోపం ఉందని, తప్పనిసరిగా ఆపరేషన్ చేయాలని సూచించారు. ఆపరేషన్ ఖర్చు సుమారుగా రూ.3.50 లక్షలు అవుతుందని వైద్యులు తెలిపారు. ఆ నిరుపేద తల్లిదండ్రులు ఆపరేషన్‌కు డబ్బులు లేక తల్లడిల్లుతున్నారు. రెక్కాడితే కానీ డొక్కాడని పరిస్థితిలో తమను ఆదుకోవాలని, దాతల తమ కుమారుడిని కాపాడాలని వేడుకుంటున్నారు.

సంప్రదించాల్సిన నం. 9676034110

పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న మాలీ సంఘం నాయకులు

ఆదిలాబాద్‌రూరల్: ఈ నెల 25న నాందేడ్ జిల్లా కిన్వట్ తాలూకా ఘోటిలో నిర్వహించనున్న మహాత్మా జ్యోతిబా పూలే, అంబేద్కర్ జయంతి పోస్టర్‌ను శుక్రవారం జిల్లా కేంద్రంలోని టీచర్స్ కాలనీలోగల పూలే గెస్ట్‌హౌస్‌లో మాలీ మహా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుకుమార్ పేట్కులే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధికసంఖ్యలో హాజరై పూలే, అంబేద్కర్ జయంతిని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాలీ మహా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాంబన్న శేండే, కోశాధికారి సతీశ్‌గుర్నులే, రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు ఉమేశ్ రావు ధోలే, కార్యక్రమ నిర్వాహకులు వామన్‌రావు వాడై, జిల్లా కార్యవర్గ సభ్యుడు రాంకిషన్ షిండే తదితరులు పాల్గొన్నారు.

మండుటెండల్లో భిక్షాటన....





నిర్మల్ జిల్లా కేంద్రంలో మండుటెండల్లో పిల్లలను చంకకు కట్టుకొని భిక్షాటన చేస్తున్నారు పలువురు తల్లులు. వీరి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో పథకాలు అమలు చేస్తున్నప్పటికీ క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదు. ఈ దృశ్యాలు చూసిన పలువురు పాపం అంటూ చర్చించుకుంటున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్



అభివృద్ధి పనులు పరిశీలించిన పీసీసీఎఫ్



క్వార్టర్‌ను ప్రారంభిస్తున్న పీసీసీఎఫ్ లోకేశ్ జైస్వాల్

కడెం: కడెం, ఉడుంపూర్ అటవీ రేంజ్ పరిధిలో పీసీసీఎఫ్(కంపా)లోకేష్ జైస్వాల్ శుక్రవారం పర్యటించారు. ఉడుంపూర్‌లో సిబ్బంది క్వార్టర్స్‌ను ప్రారంభించారు. బాండు గేటు వద్ద జంగిల్ సఫారీ ప్రారంభోత్సవానికి శంకుస్థాపన చేశారు. అనంతరం కడెం ప్రాజెక్టు బ్యాక్ వాటర్ గుట్టపై వాచ్ టవర్‌ను సందర్శించారు. గ్రాస్ ప్లాంట్‌లను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌డీవో కోటేశ్వర్‌రావు, ఎఫ్ఆర్‌వోలు అనిత, వినాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

దేవుడిని కించపర్చిన వ్యక్తిపై కేసు

గుడిహత్నూర్: హిందూ ఆరాధ్యుడు శ్రీకృష్ణుడిని అవమానపర్చేలా సోషల్ మీడియాలో పోస్టు పెట్టిన మండలంలోని మన్నూర్ గ్రామానికి చెందిన ఆర్ ఎంపీ కాంబ్లే డిగంబర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రవీణ్ కుమార్ తెలిపారు. తన ఇన్‌స్టాగామ్ ఐడీపై కృష్ణ భగవాన్‌ను కించపర్చేలా పోస్టుపెట్టి హిందువుల మనోభావాలను దెబ్బతీశారని గుర్తించిన తోషం గ్రామానికి చెందిన పస్తాపురే బాలాజీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఫైనాన్షియల్ కార్పొరేషన్

(స్టేట్ ఫైనాన్షియల్ కార్పొరేషన్ యాక్ట్ LXIII of 1951 క్రింద ఏర్పాటు చేయబడింది)
మంచిర్యాల శాఖ

స్వాధీనతా ప్రకటన (స్థిరాస్తి కోసం)

అనుబంధం IV చట్టం - రూల్స్-8(1) క్రింద

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్‌తో చదువబడే సెక్షన్ 13(2) క్రింద సంక్రమించిన అధికారములను వినియోగించుకుంటూ, ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఫైనాన్షియల్ కార్పొరేషన్ యొక్క అధీకృత అధికారియగు దిగువ సంతకందారు 17.01.2023 తేదీగల డిమాండ్ నోటీసు జారీచేసి, రుణగ్రహీత **మెసర్స్ శ్రీపాద ఆయిల్ ఇండస్ట్రీస్, ప్రాతినిధ్యం వహించు ప్రొప్రైటర్: శ్రీ మాధుగుల హరిప్రసాద్,** సర్వే నం. 117/7, ఎల్లారం గ్రామం మరియు గ్రామపంచాయతీ, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా మరియు ఆస్తి యజమాని/ హామీదారులను వారిని నోటీసులో తెలిపిన విధంగా 31.12.2022 నాటికి మొత్తం **రూ. 145.46 (ఒక కోటి నలభైఐదు లక్షల నలభైఆరు వేల రూపాయలు మాత్రమే)**లను సదరు నోటీసు స్వీకరణ తేదీ నుండి 60 రోజులలోగా తిరిగి చెల్లించాల్సిందిగా కోరారు.

రుణగ్రహీతలు/ హామీదారు సదరు మొత్తం తిరిగి చెల్లించుటలో విఫలమైనందున సదరు రూల్స్‌లోని రూల్ 8తో చదువబడే సదరు చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద సంక్రమించిన అధికారములను వినియోగించుకుంటూ, దిగువ తెలిపిన ఆస్తిని దిగువ సంతకందారు **20 ఏప్రిల్ 2023**న స్వాధీనం చేసుకున్నారని రుణగ్రహీత/ ఆస్తి యజమానికి మరియు సాధారణ ప్రజానీకానికి ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమైనది.

సదరు ఆస్తితో ఎలాంటి వ్యవహారము జరుపరాదని మరియు సదరు ఆస్తితో జరిపే ఏ వ్యవహారములైనా 31.12.2022 నాటికి మొత్తం **రూ. 145.46 లక్షలు** మరియు దానిపై వడ్డీ, వ్యయాలు ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఫైనాన్షియల్ కార్పొరేషన్, మంచిర్యాల బ్రాంచ్ చార్జీకి లోబడి ఉంటాయని ముఖ్యంగా రుణగ్రహీత/ హామీదారును మరియు సాధారణ ప్రజానీకాన్ని ఇందుమూలంగా హెచ్చరించడమైనది.

స్థిరాస్తుల వివరణ

1) శ్రీపాద ఆయిల్ ఇండస్ట్రీస్ యొక్క ఏకైక యజమానియైన శ్రీ మాధుగుల హరిప్రసాద్‌కు చెందిన, ఆదిలాబాద్ జిల్లా (ప్రస్తుతం కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా), ఆసిఫాబాద్ మండలం, ఎల్లారం గ్రామం వద్దగల సర్వే నం.117/2 ద్వారా కవర్‌చేయబడిన ఎ.0-08 గుంటల విస్తీర్ణం గల యూనిట్ భూమి యావత్తు ఫ్రీహోల్డ్ ఇంటరెస్ట్ మరియు **సరిహద్దులు:– తూర్పు:** శ్రీమతి దోమకొండ పార్వతి భూమి, **పశ్చిమం:** మెసర్స్ వెంకటేశ్వర సున్నపురాయి భట్టీ, **ఉత్తరం:** ఆర్ అండ్ బీ రోడ్డు, ఆసిఫాబాద్ నుండి ఉట్నూరుకు వెళ్ళే రోడ్డు మరియు **దక్షిణం:** శ్రీమతి దోమకొండ పార్వతి మిగతా భూమి; అందులో నిర్మించబడిన/ నిర్మించబోయే భవనాలలో ఫ్రీహోల్డ్ ఇంటరెస్ట్ మరియు ప్లాంట్ అండ్ మెషినరీ మొదలగువాటి తాకట్టు మరియు స్వాభావికంగా ఉన్న అన్ని ఫిక్స్‌డ్ అసెట్స్/ కరెంట్ అసెట్స్ యొక్క అన్ని ఫ్యూచర్ అక్విజిషన్.

2) డా. ఎం. వెంకటకృష్ణయ్య మరియు డా. పి. సుభద్ర భర్త శ్రీ డా. ఎం. వెంకటకృష్ణయ్యకు చెందిన, హైదరాబాద్, అమీర్‌పేట్ వద్దగల "మంజీరా ప్లాజా"లోని మొదటి అంతస్తులో **842 చదరపు అడుగుల** నిర్మిత ఏరియాతో పాటు 820 చదరపు గజాల మొత్తంలో 40 చదరపు గజాల అవిభాజ్య వాటాతో సెల్లార్ ఫ్లోర్‌లో కార్ పార్కింగ్ ఏరియా మరియు కామన్ ఏరియాతో GHMC ఇ.నం.7-1-450/ఎంపీ/103 కలిగిన ఫ్లాట్ నం.103 యావత్తు ఫ్రీహోల్డ్ ఇంటరెస్ట్ మరియు **సరిహద్దులు:– తూర్పు:** ఖాళీ, **పశ్చిమం:** లాబీ/ మెట్లు, **ఉత్తరం:** ఖాళీ మరియు **దక్షిణం:** ఖాళీ; అందులో నిర్మించబడిన/ నిర్మించబోయే భవనాలు.

తేది: 20.04.2023 — సం/- అధీకృత అధికారి
ప్రదేశం: మంచిర్యాల — (ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఫైనాన్షియల్ కార్పొరేషన్)

శాఖ: ప్లాట్ నం.414, బ్లాక్ నం.4, జన్మభూమి నగర్, మంచిర్యాల, సెల్: 8498945680, ఫోన్: 08736-252567
ప్రధాన కార్యాలయం: 5-9-194, చిరాగ్ అలీ లేన్, పి.బి.నం.165, హైదరాబాద్ - 500001
ఫోన్: 9866512501, 040-23201646, 23202550, 23202551, ఫ్యాక్స్: (040)-23202972
ఇమెయిల్: tsfc-gen@tgsfc.in, URL: apsfc.com

బాసర ఆలయానికి వీల్‌చైర్లు అందజేత



వీల్‌చైర్లు అందిస్తున్న బీజేపీ నాయకులు

భైంసా: బాసర శ్రీజ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయానికి వచ్చే దివ్యాంగ భక్తుల కోసం ముధోల్ బీజేపీ నాయకులు పవార్ రామారావ్‌పటేల్ ఆధ్వర్యంలో వీల్‌చైర్లు అందజేశారు. శుక్రవారం ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన ఆయన అనంతరం రూ.22వేల విలువైన వీల్‌చైర్లను ఆలయ అధికారులకు అందించారు. ఆలయ సూపరింటెండెంట్ శివరాజ్, పిఆర్ఓ విలాస్‌లు అతడిని ఘనంగా సన్మానించారు.

అటవీయేతర పనుల నిలుపుదల

నిర్మల్: జిల్లాలోని సారంగపూర్ మండలంలో చించోలి(బి)లో ఒకేషనల్ ట్రైనింగ్, స్కిల్‌డెవలప్‌మెంట్ సెంటర్, అప్రోచ్ రోడ్డు కోసం కేటాయించిన అటవీభూమిలో అటవీయేతర పనులను నిలిపివేయాలంటూ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ ఫారెస్ట్(కేంద్ర) డాక్టర్ డి.మంజునాథ ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు శుక్రవారం మరోసారి ఉత్తర్వులను పేర్కొంటూ రాష్ట్ర అటవీ, పర్యావరణశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శికి లేఖరాశారు. ఇందులో నిర్మల్ మున్సిపల్‌లో ఒకేషనల్ సెంటర్ కోసం కేటాయించిన అటవీ భూమిని రద్దు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఒకేషనల్ సెంటర్ కోసం ఇచ్చిన అటవీ స్థలాన్ని మున్సిపల్ ఈద్గా నిర్మాణానికి కేటాయించినట్లు చించోలి(బి)కి చెందిన కె.వెంకటేశ్ ఫిర్యాదు చేయడంతో పాటు న్యాయవాది అంజుకుమార్‌రెడ్డి రిట్ పిటీషన్ వేశారు. ఈ నేపథ్యంలో ఎలాంటి అటవీయేతర కార్యకలాపాలు చేపట్టవద్దని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

నిర్మాణ పనులు నిలిపివేయాలి..

చించోలి(బి) అటవీ ప్రాంతంలో నిబంధనలకు విరుద్ధంగా చేపడుతున్న నిర్మాణాలను నిలిపివేయాలంటూ బీజేపీ నాయకులు పీసీసీఎఫ్‌కు వినతిపత్రం ఇచ్చారు. శుక్రవారం జిల్లాకేంద్రంలోని కార్యాలయంలో విన్నవించారు. ఇందులో పార్టీ పార్లమెంట్ కన్వీనర్ అయ్యన్నగారి భూమయ్య, అంజుకుమార్‌రెడ్డి, మెడిసెమ్మెరాజు, సామరాజేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.



సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

FLAT FOR SALE

- LAUNCHING OFFER: రూ. 3లక్షలకే 18 లక్షల విలువ గల 1050Sft. గల 2BHK Flat సొంతం చేసుకోండి. ప్రముఖ పుణ్యక్షేత్రం యాదాద్రి Temple నుండి 28కి.మీ. మాత్రమే. ఫోన్: 9948525151, 6262838353 మార్కెటింగ్ కు ఏజెంట్లు కావలెను. [HA-3176]

WANTED

- మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారానికి3500/- సంపాదించుకోండి. వాట్సాప్ కాల్ చేయండి. 9014114663, 9959617233 [M-1190673]
- హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఫ్రీ వసతి+ భోజనం. జీ: 16K-18K, ఏజెంట్ కమిషన్ 6K. ఫోన్:9640528889, [H-793415]
- పర్మినెంట్ జాబ్స్, ప్రముఖ సంస్థ నందు డేటా ఎంట్రీ ఆపరేటర్స్, సూపర్‌వైజర్, క్లర్క్, ఆఫీస్ బాయ్స్ కావలెను. Qul: 5 to డిగ్రీ, జీతం: 15000 to 35000 ఫోన్ : 9440828190 [HA-6127]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602888, 9010299065,
9951602823, 9010608462,

క్లుప్తంగా

చట్టం ముందు అందరూ సమానమే



మాట్లాడుతున్న జడ్జి హుస్సేన్

బోథ్: చట్టం ముందు అందరూ సమానమేనని బోథ్ సివిల్ కోర్టు జడ్జి హుస్సేన్ అన్నారు. శుక్రవారం మండలంలోని చింతల్‌బోరి గ్రామంలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. చట్టాలకు లోబడి నడుచుకోవాలన్నారు. బాల్య వివాహాలు, మోటార్ వెహికిల్ చట్టాలు, విద్యా హక్కు చట్టం, అటవీ చట్టాల గురించి వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ రుక్మిణి రాందాస్, బార్ అసోసియేషన్ కార్యదర్శి పంద్రం శంకర్, న్యాయవాదులు ఆడెపు హరీశ్, కుమ్మరి విజయ్, డిప్యూటీ ఎఫ్ఆర్‌వో ప్రమోద్ కుమార్, ఎఫ్ఎస్‌వో ప్రవీణ్, ఉప సర్పంచ్ సోమ్‌నాథ్, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

డీపీఆర్వోకు సన్మానం



సన్మానిస్తున్న బీసీ సంఘం నాయకులు

కైలాస్‌నగర్: డీపీఆర్వోగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన విష్ణువర్ధన్‌ను శుక్రవారం జిల్లా బీసీ సంక్షేమ సంఘం, ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కలెక్టరేట్‌లోని సమాచారశాఖ కార్యాలయంలో ఆయనను మర్యాద పూర్వకంగా కలిసిన సత్కరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు చిక్కాల దత్తు, కలాల శ్రీనివాస్, అంజన్ కుమార్, మేకల అశోక్, జక్కుల శ్రీనివాస్, నర్ర నవీన్ యాదవ్, పిల్లి కిషన్, తదితరులు పాల్గొన్నారు.

రచన మృతి విద్యార్థి లోకానికి తీరని లోటు



నివాళులర్పిస్తున్న డీఈవో, ఉపాధ్యాయులు

ఆదిలాబాద్‌టౌన్: ఉపాధ్యాయులు రచన మృతి విద్యార్థి లోకానికి తీరని లోటని డీఈవో ప్రణీత అన్నారు. క్యాన్సర్‌తో బాధపడుతూ ఇటీవల మృతిచెందిన భౌతిక శాస్త్రం ఉపాధ్యాయురాలు సాతూరి రచన మృతి పట్ల భౌతికశాస్త్రం ఫోరం ఆధ్వర్యంలో శుక్రవారం సంతాప సభ నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సైన్స్ అధికారి రఘురమణ, భౌతిక శాస్త్రం ఫోరం అధ్యక్ష, కార్యదర్శులు విద్యాసాగర్, చంద్రశేఖర్, అసిస్టెంట్ క్యాంప్ ఆఫీసర్ మద్ది లస్మన్న పాల్గొన్నారు.

గడువులోగా రుణాలు చెల్లించాలి

నేరడిగొండ: రైతులు తీసుకున్న వ్యవసాయ రుణాలను గడువులోగా చెల్లించాలని తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్ సత్యనారాయణ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. రైతులు సకాలంలో చెల్లిస్తే వడ్డీ తక్కువగా ఉంటుందన్నారు. లేనియెడల వడ్డీ అదనంగా చెల్లించాల్సి ఉంటుందన్నారు. మహిళ సంఘాల సభ్యులు తీసుకున్న రుణాలను నెల నెలా కిస్తులు చెల్లిస్తే వారికి వడ్డీ లేని రుణాలు వర్తిస్తాయన్నారు.

టీజీసెట్‌కు ఏర్పాట్లు పూర్తి

బోథ్: స్థానిక సోషల్ వెల్ఫేర్ బాలికల గురుకుల పాఠశాలలో ఈనెల 23న జరిగే 5వ తరగతి ప్రవేశ పరీక్ష (టీజీసెట్)కు అన్ని ఏర్పాటు చేసినట్లు ప్రిన్సిపాల్ స్వర్ణలత శుక్రవారం ఒక ప్రకటలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి 1 గంటల వరకు పరీక్ష ఉంటుందన్నారు. అభ్యర్థులు గంట ముందు పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని సూచించారు.

రంజాన్ పండుగకు సర్వం సిద్ధం



ఏర్పాట్లు పరిశీలిస్తున్న ముస్లిం పెద్దలు

ఇంద్రవెల్లి: రంజాన్ పండుగను నిర్వహించేందుకు ముస్లిం మత పెద్దలు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇంద్రవెల్లి గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో శుక్రవారం హీరాపూర్ సమీపంలోని ఈద్గా వద్ద ట్రాక్టర్‌తో చదును చేయించి, పిచ్చి మొక్కలు తొలగించారు. కార్యక్రమంలో ముస్లిం పెద్దలు మహ్మద్ మసుద్, మీర్జా జీలానిబేగ్, అబ్దుల్ రహీం పాల్గొన్నారు.

గుప్పుమంటున్న గుడుంబా



బెల్లం పానకం పారబోస్తున్న ఎక్సైజ్ అధికారులు

- పల్లెల్లో తయారీ కేంద్రాలు
- గుట్టుచప్పుడు కాకుండా విక్రయాలు
- మామూళ్ల మత్తులో అధికారులు

సిరికొండ: చౌకగా దొరికే నాటుసార (గుడుంబా) మళ్లీ పల్లెల్లో గుప్పుమంటోంది. గుడుంబా తాగి కుటుంబాలు చిన్నాభిన్నం అవుతున్నాయి. గతంలో రాష్ట్ర ప్రభుత్వం గుడుంబా అమ్మకాలపై ఉక్కుపాదం మోపింది. దీంతో పల్లెలు ప్రశాంతంగా ఉండేవి. ఇటీవల గుట్టుచప్పుడు కాకుండా తయారు చేస్తున్నారు. ఇటీవల మండలంలో మూడు లీటర్ల గుడుంబా, 100 లీటర్ల బెల్లం పానకం ఎక్సైజ్ అధికారులు పట్టుకున్నారు.

గూడేల్లో, తండాలో..

ప్రభుత్వం ఎన్ని చర్యలు తీసుకున్నా.. నాటుసారా తయారీ మాత్రం ఆగడం లేదు. గిరిజన గూడేల్లో, తండాల్లో తయారీ కేంద్రాలను ఏర్పాటు చేసుకొని ఇతర ప్రాంతాలకు సరఫరా చేస్తున్నారు. చాలా తక్కువ ధరకే దొరకడంతో ప్రజలు అధికంగా తాగుతున్నారు. దీంతో గుడుంబా అమ్మకాలు జోరందుకున్నాయి. అధికారులు మామూళ్ల మత్తులో ఉండి తనిఖీలు చేయడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

కుటుంబాల్లో చిచ్చు..

గుడుంబా తాగడం వల్ల అనేక కుటుంబాల్లో చిచ్చు రేగుతోంది. చిన్నచిన్న విషయాలకే ఇంట్లో గొడవ పడి హత్యలకు దారి తీస్తోంది. తక్కువ ధరకే అధికంగా మత్తు రావడంతో పీకల దాక తాగుతున్నారు. అలాగే వారి ఆరోగ్యాన్ని కూడా లెక్క చేయడం లేదు. రోజంతా కష్టపడి వచ్చిన డబ్బులతో గుడుంబా తాగేందుకే వెచ్చిస్తున్నారు. యువత కూడా బానిస అయి తమ జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గుడుంబా విక్రయాలను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం



ప్రభుత్వం నిషేధించిన గుడుంబా తయారు చేసినా.. విక్రయించిన కఠిన చర్యలు తీసుకుంటాం. ఇటీవల పలు గ్రామాల్లో దాడులు చేసి బెల్లం పానకం పట్టుకోవడం జరిగింది. ఎవరైనా విక్రయిస్తే సమాచారం ఇవ్వండి. కేసులు నమోదు చేసి, బైండవర్ చేస్తాం.

– రాజమౌళి, ఎక్సైజ్, సీఐ ఇచ్చోడ

అటెన్షన్ ప్లీజ్.. ప్రహరీ లేక ఇబ్బందులు



తాంసి: మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయానికి ప్రహరీ లేకపోవడంతో విద్యార్థినులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. పాఠశాల ఆవరణలోకి పశువులు, పందులు వస్తున్నాయని వాపోతున్నారు. అధికారులు స్పందించి ప్రహరీ నిర్మాణం చేపట్టాలని విద్యార్థినులు కోరుతున్నారు.

– సంబంధిత అధికారి: అలేఖ్య, కేజీబీవీ ప్రత్యేకాధికారి

పట్నాపూర్‌లో ఇన్నోవేషన్ డే

బోథ్: మండలంలోని పట్నాపూర్‌లో శుక్రవారం అంతర్జాతీయ ఇన్నోవేషన్ దినోత్సవాన్ని సర్పంచ్ పంద్రం సుగుణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆవిష్కరణల సంబంధిత విషయాల గురించి గ్రామస్తులకు వివరించారు. నూతన ఆవిష్కరణలు కనుగొనేలా చేయడమే ఈకార్యక్రమం ఉద్దేశమన్నారు. ఉప సర్పంచ్ తొడసం కైలాస్, వ్యవసాయ విస్తరణ అధికారి శ్యామ్, పంచాయతీ కార్యదర్శి మిథున్, అంగన్‌వాడీ కార్యకర్త శోభ పాల్గొన్నారు.

కంటివెలుగు ప్రారంభం

బోథ్: మండలంలోని నక్కలవాడ గ్రామ పంచాయతీలో కంటివెలుగు కార్యక్రమాన్ని సర్పంచ్ విజయ్, ఎంపీటీసీ జుగాది రావ్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఈ యశోద, సూపర్‌వైజర్ భారత లక్ష్మి, హెల్త్ అసిస్టెంట్ గోవింద్, ఏఎన్ఎం కవిత, స్వప్న, ఆప్తాల్మిక్ సంతోశ్, స్వరూప పాల్గొన్నారు.

దేశ రాజకీయాల్లో బీఆర్ఎస్‌ది కీలక పాత్ర



బైక్ ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే జోగు రామన్న

- ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న

ఆదిలాబాద్‌రూరల్: దేశ రాజకీయాల్లో బీఆర్ఎస్ కీలక పాత్ర పోషిస్తుందని ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. శుక్రవారం ఆదిలాబాద్ రూరల్ మండలంలోని పిప్పల్‌ధరి గ్రామంలో బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ముందుగా మామడిగూడ నుంచి పిప్పల్‌ధరి గ్రామం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దేశంలోని రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తీర్చడమే సీఎం కేసీఆర్ లక్ష్యమన్నారు. కార్యకర్తలు కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ మనోహర్, ఎంపీపీ గంద్రత్ రమేశ్, వైస్ ఎంపీపీ జంగు, ఎంపీటీసీ జంగు బాపు, పీఏసీఎస్ చైర్మన్ మెస్రం పరమేశ్వర్, మెట్టు ప్రహ్లాద్, కుమ్ర రాజు, పోతన్న, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలి

కైలాస్‌నగర్: విద్యార్థులు తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమైందని, వారిని ఆ దిశగా ప్రోత్సహించాలన్నారు. శుక్రవారం పట్టణంలోని వినాయక్ చౌక్‌లోని సరస్వతి శిశు మందిర్‌లో నిర్వహించిన సన్మాన కార్యక్రమానికి హాజరయ్యారు. సరస్వతి దేవి చిత్ర పటానికి పూలమాలలు వేసి పూజలు చేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ రౌతు మనోహర్, మాజీ మార్కెట్ చైర్మన్ మెట్టు ప్రహ్లాద్, ఉపాధ్యాయులు నర్సింగ్ రావు, సతీశ్, రాజేశ్వర్, ప్రసాద్, సురేశ్, భాస్కరరావు పాల్గొన్నారు.

‘మాటలకే పరిమితమైన ఎమ్మెల్యే’

బోథ్: బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు మాటలకే పరిమితం అయ్యారని కాంగ్రెస్ నియోజకవర్గ నాయకులు ఆడె గజేందర్ అన్నారు. బోథ్ మండల కేంద్రానికి ఆనుకుని ఉన్న వంతెన శిథిలావస్థకు చేరింది. 20 గిరిజన గ్రామాలకు రాకపోకలకు అంతరాయం ఏర్పడుతున్నా.. ఎందుకు పట్టించుకోవడం లేదని నాయకులు శుక్రవారం ధర్నా నిర్వహించారు. వంతెన ప్రమాదకర స్థితిలోకి చేరుకుందని తెలిసినా.. వంతెన నిర్మాణం ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. ఎంపీ సోయం బాపురావు సైతం గిరిజన గ్రామాలను పట్టించుకోవడం విమర్శించారు. కాంగ్రెస్ మండల కన్వీనర్ మహేందర్, పట్టణ అధ్యక్షుడు సల్ల రవి, నాజర్ అహ్మద్, బొడ్డు గంగారెడ్డి, చెట్లపెల్లి అనిల్, రాజశేఖర్, అబ్రార్ పాల్గొన్నారు.



వంతెన వద్ద బైఠాయించిన నాయకులు

సమాచారం

రేపు శనగ కొనుగోళ్లు

జైనథ్: ఈనెల 23న ఆదివారం మండల కేంద్రంలోని మార్కెట్ యార్డ్‌లో ఒక్కరోజు శనగల కొనుగోలు నిర్వహిస్తామని సొసైటీ సీఈవో గంగన్న తెలిపారు. ఇటీవల శనగల కొనుగోళ్లు పూర్తి కాగా.. కొన్ని గ్రామాల రైతుల వద్ద శనగ నిల్వ ఉన్నందున కొనుగోళ్లు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. రైతుల వద్ద శనగలు మిగిలి ఉంటే మార్కెట్ యార్డ్‌లు తీసుకురావాలన్నారు.

రేపు సమావేశం

కైలాస్‌నగర్: తెలంగాణ వైద్య, ప్రజారోగ్య ఉద్యోగుల సంఘం జిల్లా సర్వసభ్య సమావేశం ఈనెల 23న నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బండారి కృష్ణ, సిడాం వామన్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయ సమావేశ మందిరంలో ఉదయం 10గంటలకు ఉంటుందన్నారు.

రేపు బసవేశ్వర జయంతి

కైలాస్‌నగర్: మహాత్మా బసవేశ్వర జయంతి వేడుకలను 23న ఉదయం 10గంటలకు జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహిస్తుంచనున్నట్లు కలెక్టర్ రాహుల్‌రాజ్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా అధికారులు, ప్రజలు తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు.

27న ఉద్యోగుల భవిష్యనిధిపై అవగాహన

కైలాస్‌నగర్: ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ ప్రాంతీయ కార్యాలయం కరీంనగర్ ఆధ్వర్యంలో నిధి అప్కే నికత్ 2.0పై ఈనెల 27న అవగాహన కల్పించనున్నట్లు ఆసంస్థ ప్రాంతీయ కార్యాలయ కమిషనర్ తానయ్య ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో నిర్వహించడం జరుగుతుందన్నారు. జిల్లాలోని పీఎఫ్ సభ్యులు, ట్రేడ్ యూనియన్ల ప్రతినిధులు, యజమానులు హాజరు కావాలని కోరారు.

సంక్షిప్త వార్తలు

హనుమాన్ చాలీసా పారాయణానికి తరలిరండి

గుడిహత్నూర్: జిల్లా కేంద్రంలోని రాంలీలా మైదానంలో శనివారం నిర్వహించే సామూహిక హనుమాన్ చాలీసా పారాయణానికి భక్తులు తరలిరావాలని బీజేపీ మండల ఉపాధ్యక్షుడు తరుణ్ గిత్తే ఒక ప్రకటనలో కోరారు. విరాట్ హిందూ సమ్మేళనంలో భాగంగా సాయంత్రం 6 గంటకు నిర్వహిస్తున్న కార్యక్రమానికి ముఖ్య వక్తగా ప్రముఖ అప్పాల ప్రసాద్, ప్రముఖ ప్రవచనకారుడు నారాయణ్ మహారాజ్‌తో పాటు గోపాల కృష్ణ మఠాధీషులు పాల్గొంటారని తెలిపారు.

రంజాన్ పండుగ సరుకులు పంపిణీ

తాంసి: మండల కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో పేద ముస్లిం కుటుంబాలకు శుక్రవారం రంజాన్ సరుకులు పంపిణీ చేశారు. టీపీసీసీ కార్యవర్గ సభ్యుడు వన్నెల అశోక్ అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కిష్టన్న, రామన్న యాదవ్, చిన్నరాం రెడ్డి, గంగారెడ్డి, ముస్లిలు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

ఇచ్చోడ: ఇచ్చోడలోని తపాలా శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని శుక్రవారం ఎంపీపీ నిమ్మల ప్రీతం రెడ్డి, ఉప సర్పంచ్ లోక శిరీష్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ప్రజలకు తాగునీటి సౌకర్యం కల్పించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ శివకుమార్, రాకేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

భోగ్ భండార్‌లో పాల్గొన్న జెడ్పీటీసీ

గుడిహత్నూర్: మండలంలోని కొల్హారీ గ్రామంలోని దేవీ ఆలయంలో నిర్వహించిన భోగ్ భండార్ కార్యక్రమంలో జెడ్పీటీసీ అనిల్ జాదవ్ పాల్గొన్నారు. కార్యక్రమానికి హాజరైన రాంసింగ్ మహారాజ్, శేఖర్ మహారాజ్‌ల ఆశీర్వచనాలు పొందారు. ఆయన వెంటన సర్పంచ్ కల్పనాగజానంద్ గిత్తే, సర్పంచ్ పాండురంగ్, మాజీ పీఏసీఎస్ చైర్మన్ వెంకట్రావ్ ఉన్నారు.

వీవోఏల వినూత్న నిరసన

తాంసి: వీవోఏల సమస్యలు పరిష్కరించాలని చేస్తున్న సమ్మె శుక్రవారం ఐదో రోజుకు చేరుకుంది. తాంసి మండల కేంద్రంలో వీవోఏలు శుక్రవారం చెవిలో పువ్వులు పెట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ మద్దతు తెలిపారు. ఈసందర్భంగా కిరణ్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఐకేపీలో పనిచేస్తున్న వీవోఏల సమస్యలను పరిష్కరించడంలో విఫలమైందని ఆరోపించారు. కార్యక్రమంలో వీవోఏలు రమేశ్, దాసు, చందర్, పుష్ప, తదితరులు పాల్గొన్నారు.

మద్దతు తెలిపిన సీఐటీయూ..

భీంపూర్ మండల కేంద్రంలోని వీవోఏల సమ్మెకు సీఐటీయూ నాయకులు మద్దతు తెలిపారు. జిల్లా అధ్యక్షుడు భోజ్జ ఆశన్న, ఉపాధ్యక్షుడు మల్లేశ్ వారితో కలిసి నిరసన తెలిపారు. సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి, వేతనాలను పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వీవోఏల మండల అధ్యక్షుడు అరుణ్, వీవోఏలు దాంజీ, విజయలక్ష్మీ, సత్యనారాయణ, ప్రమోద్, సంతోశ్ పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి: వీవోఏల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని వీవోఏల సంఘం మండల అధ్యక్షుడు షేక్ ఫెరోజ్ అన్నారు.



నేరడిగొండ: వినతి పత్రం అందజేస్తున్న వీవోఏలు

చాలీచాలని వేతనాలలో విధులు నిర్వహిస్తున్నా.. కనీస వేతనం, ఉద్యోగ భద్రత లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వివోఏలు కోట్నాక్ భారిక్ రావ్, రంగుల రాజమణి, కారం రాజేశ్వర్, మడావి జల్‌దేవి, మహేశ్, జుగ్నాక్ రాందాష్ పాల్గొన్నారు.

నేరడిగొండ: సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వీవోఏలు చేపడుతున్న సమ్మె కొనసాగుతోంది. శుక్రవారం సెర్ప్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా టీజీబీ మేనేజర్ సత్యనారాయణకు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. సంఘం అధ్యక్షుడు భూపతి రాజు, తదితరులు పాల్గొన్నారు.

గుడిహత్నూర్: వీవోఏల సమ్మెకు దళిత శక్తి ప్రోగ్రాం మద్దతు ఇస్తుందని డీఎస్పీ మండలాధ్యక్షుడు బడుగు రాజేశ్వర్ అన్నారు. ఐకేపీ కార్యాలయం ఎదుట నిర్వహిస్తున్న వీవోఏల సమ్మెలో పాల్గొని మాట్లాడారు. ఎన్నో ఏళ్లుగా వెట్టిచాకిరీ చేస్తున్న వీవోఏలకు న్యాయం చేయాలన్నారు. డీఎస్పీ నాయకులు కమలాకర్, వెంకటేశ్, నరేశ్, రాజేశ్ పాల్గొన్నారు.



తాంసి: చెవిలో పువ్వులతో నిరసన తెలుపుతున్న వీవోఏలు

తలమడుగు: ఐకేపీ వీవోఏల సమస్యలు పరిష్కరించాలని మండల అధ్యక్షుడు వినోద్, గౌరవ అధ్యక్షుడు స్వామి కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో సమ్మె నిర్వహించారు. ప్రభుత్వ ఉద్యోగులగా గుర్తించాలని, కనీస వేతనం రూ. 26,000 ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రామన్న, నారాయణరెడ్డి, రమేశ్, కిషన్ పాల్గొన్నారు.

బోథ్: తమను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేస్తూ వీవోఏలు చేపట్టిన దీక్షలు శుక్రవారం రెండో రోజుకు చేరుకున్నాయి. కనీస వేతనం రూ.26 వేలు, ఐడీకార్డు అందించాలన్నారు.

ఉపాధి పనులు సద్వినియోగం చేసుకోవాలి



కూలీలతో మాట్లాడుతున్న డీఆర్‌డీవో

ఇంద్రవెల్లి: ప్రజలు ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలని డీఆర్‌డీవో పీడీ కిషన్ అన్నారు. శుక్రవారం మండలంలోని ఏమాయికుంట గ్రామ పంచాయతీ పరిధిలో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. జాబ్‌కార్డు ఉన్న ప్రతిఒక్కరికీ పని కల్పించాలన్నారు. అదనపు డీఆర్‌డీవో రవీందర్, ఎంపీడీవో పుష్పలత, ఏపీవో జాదవ్ శ్రీనివాస్, సర్పంచ్ జాదవ్ లఖన్ పాల్గొన్నారు.

పనుల పరిశీలన

సిరికొండ: మండల కేంద్రంతో పాటు మండలంలోని కొండాపూర్ గ్రామంలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను శుక్రవారం ఎంపీడీవో సురేశ్ పరిశీలించారు. కూలీలు వందశాతం హాజరయ్యేలా చూడాలన్నారు. కొలతల ప్రకారం గుంతలు తవ్వాలని, పని ప్రదేశంలో జాగ్రత్తగా ఉండాలని ఎఫ్ఏ ఈశ్వర్‌కు సూచించారు. కార్యక్రమంలో ఉపాధి హామీ ఏపీవో శేషరావు, ఎఫ్ఏలు, మెట్‌లు, కూలీలు పాల్గొన్నారు.

నేరడిగొండ: ఉపాధిహామీ కూలీలు జాగ్రత్తలు పాటిస్తూ.. పనులు చేయాలని ఎంపీడీవో అబ్దుల్ సమద్ అన్నారు. శుక్రవారం మండలంలోని కుప్టి, కిష్టాపూర్ గ్రామాలను సందర్శించారు. పని ప్రదేశంలో వసతులు కల్పించాలన్నారు. సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు గ్రామాభివృద్ధికి పాటుపడాలని సూచించారు. ఆయన వెంట ఎంపీవో శోభన, సర్పంచులు ఓర్స రాజు యాదవ్, గీత పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్

ఇంద్రవెల్లి: పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని కాగ్నే ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనానికి హాజరయ్యారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం కల్యాణలక్ష్మి, షాదీముబారక్, ఉచిత విద్యుత్, కేసీఆర్ కిట్, రైతుబంధు, దళితబంధు పథకాలను ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తుందన్నారు. కాంగ్రెస్ 70 ఏళ్ల పాలనలో ప్రజలకు ఏం చేసిందో చెప్పాలన్నారు. బీజేపీ మత రాజకీయాలు చేసి, అలర్లు సృష్టించేందుకు ప్రయత్నిస్తుందని ఆరోపించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి గోడం నగేశ్, ఏఎంసీ చైర్మన్ జాదవ్ శ్రీరాంనాయక్, పీఏసీఎస్ చైర్మన్ మారుతి డోంగ్రె, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు మహ్మద్ అంజద్, సర్పంచ్‌లు కోరెంగా గాంధారి, జాదవ్ లఖన్, యేర్మ జాకేశ్వర్, మడావి శేకు, గిత్తే ఆశబాయి, స్వర్ణలత, కుమ్ర జంగుబాయి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రేఖానాయక్

‘ప్రజాదరణ చూసి ఓర్వలేక అక్రమ కేసులు’

ఆదిలాబాద్: ప్రజాదరణ చూసి ఓర్వలేకనే తన కుటుంబ సభ్యులపై ఎమ్మెల్యే జోగు రామన్న అక్రమ కేసులు బనాయిస్తున్నారని బీజేపీ నాయకుడు కంది శ్రీనివాస్ రెడ్డి ఆరోపించారు. ఆయన సొంత న్యూస్ ఛానల్ డైరెక్టర్లపై కేసులు నమోదు చేయడాన్ని నిరసిస్తూ జిల్లా కేంద్రంలోని కైలాసనగర్ కాలనీలో గల ఆయన క్యాంపు కార్యాలయం వద్ద నాయకులతో కలిసి శుక్రవారం ఆందోళన చేపట్టారు. ఎమ్మెల్యే జోగు రామన్నకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. రానున్న ఎన్నికల్లో ప్రజలే బుద్ధి చెబుతారని అన్నారు. కార్యక్రమంలో నాయకులు గొర్ల రాజు యాదవ్, జీవీ రమణ, శంకర్, గిమ్మ సంతోశ్ రావు, కడప సోనేరావు, రాజకుమార్, సంతోశ్‌సింగ్ ఠాకూర్, రవికిరణ్ రెడ్డి, సంతోశ్‌రెడ్డి, వెంకట్ రెడ్డి, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.



ఆందోళన కార్యక్రమంలో పాల్గొన్న శ్రీనివాస్‌రెడ్డి

చలివేంద్రం ప్రారంభం

బేల: మండల కేంద్రంలోని అంబేద్కర్, శివాజీ చౌరస్తాలలో శుక్రవారం కేఎస్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని బీజేపీ నాయకులు కంది శ్రీనివాస్‌రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో దత్తా నిక్కమ్, ఠాక్రే సందీప్, శివకుమార్, జీవన్‌రెడ్డి, బర్కాడే రాము, పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

తలమడుగు: మండలంలోని సుంకిడి గ్రామానికి చెందిన నిమ్మల లచ్చరెడ్డి, అదే గ్రామానికి చెందిన నిమ్మల రాజారెడ్డి, తలమడుగు గ్రామానికి చెందిన బీఆర్ఎస్ జిల్లా నాయకుడు కాటిపెళ్లి శ్రీనివాస్‌రెడ్డి చిన్నమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. దీంతో శుక్రవారం ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు వారి కుటుంబసభ్యులను పరామర్శించారు. మండల కన్వీనర్ తోట వెంకటేశ్, మొట్టె కిరణ్‌కుమార్, వెల్మ శ్రీనివాస్‌రెడ్డి, మగ్గిడి ప్రకాష్, సర్పంచ్ గెల్ల మహేందర్ యాదవ్ ఉన్నారు.

వంతెన నిర్మాణం చేపట్టాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న ఎంపీపీ శ్రీనివాస్

బోథ్: మండల కేంద్రానికి ఆనుకుని ఉన్న కంద్ర వాగుపై వంతెన నిర్మాణం చేపట్టాలని ఎంపీపీ తుల శ్రీనివాస్ శుక్రవారం ఆదిలాబాద్‌లో జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్‌ను కలిసి విన్నవించారు. వచ్చే వర్షాకాలంలోపు నిర్మాణం పూర్తి చేయాలన్నారు. మందబొగడ శ్మశాన వాటికలో బోరు వేయడాన్ని అటవీ శాఖ అధికారులు అడ్డుకుంటున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఆయన వెంట సర్పంచుల సంఘం అధ్యక్షుడు శ్రీధర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
ఆదిలాబాద్
99516 02888
99122 20764
Office mail : nzbadvt@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
ఆదిలాబాద్ : కె.రమేష్ - 8019715058
బోథ్ : ఖాజా మొయినొద్దీన్ - 7997958184
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899